


క్షణం ఆలోచిస్తే.. నిలుస్తుంది ప్రాణం

సమస్య వచ్చినపుడు కుంగిపోరాదు. నిమిషం ఆలోచిస్తే పరిష్కార మార్గం కనిపిస్తుంది. క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయం సరికాదు.

8లో



టమాట కిలో రూ.18

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.11, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.2°/20.8°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు 'పరిష్కార వేదిక'



ప్రశాంతి నిలయం/ పుట్టపర్తి టౌన్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇక జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అర్జీల ద్వారా విన్నవించుకోవాలని సూచించారు.

'యూరియా'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రశాంతి నిలయం: యూరియా సరఫరాలో అక్రమాలు జరిగినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చేతన్ హెచ్చరించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో యూరియా స్టాక్, సరఫరా, తదితర అంశాలపై అర్డీఓలు, ఏడీఏలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూరియా సరఫరా సక్రమంగా సాగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఎస్‌కేల వారీగా నమోదైన పంటలు, యూరియా అవసరాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. యూరియా నిల్వలు ఆర్ఎస్‌కేలకు రాకముందే గ్రామంలోని రైతులకు సమాచారం అందించాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సంబంధించి ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో తప్పకుండా ప్రభుత్వం నిర్దేశించిన వివరాలు నమోదు చేయాలన్నారు. డిమాండ్ – సప్లయ్ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిమజ్జనం.. ప్రశాంతం



గణేశుడి శోభాయాత్ర

మడకశిర: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. వినాయక చవితి సందర్భంగా మడకశిరలో కొలువుదీరిన గణనాథులను ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజించారు. శనివారం రాత్రి పది గంటలకు నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక వాహనాల్లో కొలువుదీర్చిన వినాయక విగ్రహాలతో శోభాయాత్ర ప్రారంభమై ఆదివారం తెల్లవారుజాము వరకు సాగింది. భారీ పోలీసు బందోబస్తు క్రేన్ల సాయంతో విగ్రహాలను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. గణపతి బప్ప మోరియా.. బైబై గణేశా అంటూ భక్తులు వీడ్కోలు పలికారు. డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో సీఐలు రాజ్‌కుమార్, నగేష్ బందోబస్తును పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ పర్యవేక్షించారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలకు సీఐ నగేష్ కృతజ్ఞతలు తెలిపారు.



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

పట్టుచీరలకు ప్రసిద్ధి ధర్మవరం. సిల్క్‌సిటీ హబ్‌గా ఈ ప్రాంతం పేరుగాంచింది. రోజూ వివిధ రాష్ట్రాల నుంచి 'పట్టు' వ్యాపారులు, షోరూం నిర్వాహకులు ధర్మవరం వచ్చి వ్యాపార లావాదేవీలు చేస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న పట్టణంలో కొంతకాలంగా ప్రజలు భయంభయంగా కాలం గడుపుతున్నారు. ఇందుకు కారణమేమిటంటే అసాంఘిక శక్తులు చెలరేగిపోవడమే. హత్యలు, గంజాయి బ్యాచ్ ఆగడాలు, కాల్‌మనీ మాఫియా దాష్టీకాలు, బైక్‌ల చోరీలు, ఉగ్ర కదలికలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.



ధర్మవరం రైల్వే స్టేషన్ పరిసరాల్లో గంజాయి సేవిస్తున్న దృశ్యం

ధర్మవరం.. కలవరం

- నెల వ్యవధిలో రెండు హత్యలు
- హడలెత్తిస్తున్న గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు
- పెరిగిపోతున్న ద్విచక్ర వాహనాల చోరీలు

ధర్మవరం: అసాంఘిక శక్తులు పేట్రేగిపోతుండటంతో ధర్మవరం ప్రజలకు ప్రశాంతత కరువవుతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలెత్తిపోతున్నారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలైన గ్యాస్ గోడౌన్, కొత్తపేట, గుట్టకిందపల్లి, తారకరామాపురం, శాంతినగర్ తదితర ప్రాంతాలలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొంతమంది నేరచరితులు, రౌడీషీటర్లు, అల్లరి మూకలు గంజాయికి బానిసై ప్రజలపై విరుచుకు పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. రాత్రి 11 గంటల సమయం దాటిందంటే అల్లరి మూకలు గంజాయి సేవించి రోడ్లపైకి రావడం వచ్చి పోయే వాహనదారులను అటకాయించి డబ్బులు, బంగారు లాక్కోవడం పరిపాటిగా మారుతోంది. ఇటీవల అనంతపురం నుంచి చిగిచెర్ల మీదుగా ధర్మవరానికి వస్తున్న వాహనదారులను అటకాయించి డబ్బులు లాక్కోవడంతో వారు భయాందోళనకు గురై ఎవ్వరికీ చెప్పకుండా మిన్నకుండిపోయారు. మరో మెడికల్ రెప్ అర్ధరాత్రి సమయంలో తారకరామాపురం మీదుగా వస్తుండగా గంజాయి బ్యాచ్ ద్విచక్రవాహనాన్ని ఆపి మరీ డబ్బులు డిమాండ్ చేశారు. ఇందుకు సదరు మెడికల్‌రెప్ నిరాకరించడంతో కత్తితో దాడి చేసి గాయపరిచారు. పోలీసులకు చెబితే ఎక్కడ మళ్లీ వారు దాడి చేసి దౌర్జన్యానికి తెగబడతారోనని బాధితులు భయపడిపోతున్నారు.



ధర్మవరం రైల్వే స్టేషన్ ఆవరణలో గంజాయి మత్తులో పడిపోయిన యువకుడు

పోలీసుల మెతక వైఖరి

గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టడంలో పోలీసులు మెతక వైఖరి అవలంబిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది కూటమి పార్టీల చోటా మోటా నాయకులు అండ ఉండటంతో పోలీసులు చూసీచూడనట్లు పోతున్నారు. దీంతో గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నాయి. కూటమి పార్టీల నాయకులకు మేలు చేసేందుకు పోలీసులు అనుసరిస్తున్న వైఖరితో శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

ఈజీ మనీ కోసం బైక్‌ల చోరీలు

గంజాయికి బానిసైన కొంతమంది అల్లరి మూకలు ఈజీ మనీకి అలవాటు పడి చోరీలకు తెగబడుతున్నారు. ఇటీవలి కాలంలో పట్టణంలో బైక్‌లు కనపడితే చాలు చోరీలు చేయడం.. వాటిని ఏ పార్ట్‌కు ఆ పార్ట్ తీసి గుజిరీల్లో అమ్ముకోవడం పరిపాటిగా మారింది.

పోలీసులు భరోసా కల్పిస్తారా..?

ధర్మవరంలో రెండు పోలీసు స్టేషన్లకు కూతవేటు దూరంలో ఒక వ్యక్తిని దారుణంగా హతమార్చారు. మూడురోజుల క్రితం కొత్తపేటలో మరో రౌడీషీటర్‌ను పట్టపగలు 16 సార్లు వేట కొడవళ్లతో నరికి చంపేశారు. నెల రోజుల వ్యవధిలోనే జరిగిన ఈ రెండు హత్యలు కుటుంబ కలహాలు, ప్రతీకార ఘటనలే. రౌడీషీటర్లకు తగిన విధంగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి నేరచరితుల్లో దడపుట్టించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. విచ్చలవిడిగా మద్యం సేవించేందుకు కారణమవుతున్న బెల్ట్‌షాపులపై చర్యలు చేపట్టి, గంజాయి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రాత్రివేళల్లో పోలీసుల గస్తీ పెంచి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపితే తప్ప సిల్క్‌సిటీలో ప్రజలలో నెలకొన్న అభద్రతా భావాన్ని నివారించలేని పరిస్థితి. రాజకీయ నాయకుల సిఫార్సులకు అసాంఘిక శక్తుల విషయంలో పోలీసులు మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రజలు అభద్రతాభావంతో కాలం వెళ్లదీసే పరిస్థితి నెలకొంటుంది. పట్టణ ప్రాముఖ్యత కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

ముదిగుబ్బ నుంచి గంజాయి రవాణా

కదిరి నుంచి ముదిగుబ్బకు గంజాయిని డంప్ చేసి, అక్కడి నుంచి ధర్మవరం రైల్వేస్టేషన్‌కు చేర్చి పరిసర ప్రాంతాలలో విక్రయిస్తున్నట్లు సమాచారం. రాత్రివేళల్లో రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలో గంజాయిని వివిధ రూపాల్లో ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు తెలిసింది. మత్తు ఎక్కువగా ఉండటం, ధర తక్కువ కావడంతో గంజాయికి అల్లరి మూకలు బానిసవుతున్నట్లుగా సమాచారం. ఈ వ్యవహారంలో కింది స్థాయి పోలీస్ సిబ్బంది అండదండలు ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. గంజాయితో పాటు పట్టణంలో విచ్చల విడిగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి కాకా హోటల్‌లో సైతం బార్‌ను తలపించే విధంగా మద్యం సేవింపజేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ధాబాలు సైతం బార్‌లను మరిపిస్తున్నాయి. అటు పోలీసులు గానీ, ఇటు ఎక్సైజ్ అధికారులు గానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యలే నేరాలు ఎక్కువయ్యేందుకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి.

ఉక్కుపాదం మోపుతాం ధర్మ



శాంతిభద్రతలకు విఘాతం కల్గించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. గంజాయి రవాణా, విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇందు కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. గంజాయి సేవించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని వదిలే ప్రసక్తే లేదు. ఈ దిశగా ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ప్రజల వద్ద ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి.

– వి.రత్న, ఎస్పీ

ఆలయాల మూత



చంద్రగ్రహణం నేపథ్యంలో మూతపడిన ఖాద్రీశుని ఆలయం

కదిరి టౌన్/ లేపాక్షి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కదిరిలోని శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన రాజగోపురం తలుపులు ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం 6 గంటలకు తలుపులు తెరుస్తారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, ఆలయ సంప్రోక్షణ, పరివార దేవత మూర్తులకు పుళికాపు, తిరుమంజనములు, నిత్య ప్రత్యాబ్దికములు గావించి, ఆరాధన, నివేదన అనంతరం భక్తులకు ఉదయం 8.30 గంటల నుంచి స్వామివారి దర్శనం కల్పిస్తామని ప్రధాన అర్చకులు పార్థసారథి ఆచార్యులు తెలిపారు.

= లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆదివారం పూజాకార్యక్రమాలు ముగిసిన తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు మూసివేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఆలయ శుద్ధి, అభిషేకాల అనంతరం 8 గంటల నుంచి భక్తులకు స్వామి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.



లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం తలుపులు మూసివేసిన అర్చకులు, సిబ్బంది

అన్నదాత పోరుకు తరలిరండి

- యూరియాపై సీఎం మాటలు హాస్యాస్పదం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల: ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నిరసిస్తూ రైతులకు బాసటగా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహించతలపెట్టిన అన్నదాత పోరును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. పెనుకొండలో ఈ నెల 9న నిర్వహించే 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆమె ఆదివారం గోరంట్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ యూరియా సహా అవసరమైన ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం కావడంతో వరి, ఇతర పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా వినియోగం వల్ల క్యాన్సర్ వస్తుందంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన సొంత కంపెనీ హెరిటేజ్‌కు లాభాలు చేకూర్చడం కోసం రైతులు వరి, ఇతర పంటలు సాగు చేయకుండా పాడిపరిశ్రమ వైపు దృష్టి సారించాలని చెబుతున్నారని ధ్వజమెత్తారు. బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించి, ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకుల సిఫార్సుల మేరకు కాకుండా సీనియారిటీ ప్రాతిపదికన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు.



'అన్నదాత పోరు' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉషశ్రీ చరణ్

బాబు మోసాలను వివరించండి

ఎన్నికల సమయంలో ఇచ్చిన వందలాది హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని ఉషశ్రీచరణ్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం కమ్మవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఏడాది దాటినా అరకొర పథకాలు అమలు చేసి.. అవీ అనేక కొర్రీలు వేసి చాలామంది అర్హులకు ఫలాలు అందకుండా చేశారని కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటేశు, టౌన్ కన్వీనర్ మేదర శంకర, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాబ్, సీనియర్ నాయకులు గంపల వెంకటరమణారెడ్డి, కమ్మవారిపల్లి పంచాయతీ నాయకులు రంగారెడ్డి, రాజు, రామిరెడ్డితో పాటు మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కరుణ లేని సర్కారులో

కన్నీళ్లే మిగిలాయి..

తన ఈడు స్నేహితురాళ్లతో సంతోషంగా ఆడుకోవాల్సిన వయసులో తీరని అన్యాయానికి గురైంది. మృగాళ్ల చేతికి చిక్కి విలవిలలాడిపోయింది. తల్లిదండ్రుల ప్రేమానురాగాలు పొందాల్సిన సమయంలో తనే ఓ బిడ్డకు తల్లయ్యింది. మేమున్నాం అంటూ ఆదుకోవాల్సిన వారు.. అలా చేస్తే ఎక్కడ తప్పు ఒప్పుకున్నట్లు అవుతుందోనని అసలు అటువైపే చూడలేదు. నాలుగు గోడలకే పరిమితం చేసేశారు. గుండెలవిసేలా రోదించినా స్పందన లేదు. అయిన వాళ్లు లేరు.. పలకరించే వారు కరువయ్యారు. ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు కూడా కరువైపోయాయి. మౌన రోదనే మిగిలింది. చంద్రబాబు ప్రభుత్వ అలసత్వ ధోరణితో ఏడుగుర్రాలపల్లి దళిత బాలిక కుటుంబం వీధిన పడింది.

గతంలో సుగాలి ప్రీతి.. నేడు ఏడుగుర్రాలపల్లిలో యువతి

- దళిత మైనర్ బాలిక జీవితం అధోగతి
- ప్రసవమైన మూడు వారాలకే తల్లీబిడ్డను వేరుచేసిన అధికారులు
- ఎన్జీవో హోంలో బిక్కు బిక్కుమంటూ బతుకీడుస్తున్న బాలిక
- పసికందును ఎక్కడికి చేర్చారో ఇప్పటికీ తెలియని దుస్థితి
- బాధిత కుటుంబాన్ని పట్టించుకోని బాబు ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గత టీడీపీ సర్కారు హయాంలో కర్నూలు జిల్లాలో సుగాలి ప్రీతిని కొందరు మృగాళ్లు అత్యాచారం చేసి హత్య చేశారు. ఆ పాపం ఇప్పటికీ చంద్రబాబు సర్కారును వెంటాడుతోంది. ఇంచుమించు అలాంటి ఘటనే మళ్లీ.. అదీ బాబు సీఎంగా ఉన్న సమయంలోనే రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లెలో జరిగింది. టీడీపీకి చెందిన మానవ మృగాలు ఓ దళిత బాలికను చెరపట్టి సామూహిక అత్యాచారం చేశాయి. దీంతో ఆ



బాలిక గర్భం దాల్చి బిడ్డకు తల్లయింది. ఈ అమానుష ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మృగాళ్ల చేతిలో అన్యాయానికి గురైన బాలిక నేడు ఓ ఎన్జీవో హోంలో బాధను దిగమింగుకుని బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తోంది.

ఎన్జీవో హోంలో ఒంటరి బతుకు..

కొన్ని మాసాల క్రితం ఏడుగుర్రాలపల్లెలో దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేశారు. ఈ విషయం బాహ్య ప్రపంచానికి తెలిసే సరికి ఆమె ఐదు మాసాల గర్భిణి. తర్వాత రెండు నెలలకు అనంతపురం సర్వజనాసుపత్రిలో ప్రసవం అయింది. అనంతరం మూడు వారాలకే తల్లినుంచి బిడ్డను వేరు చేశారు. తల్లిని బత్తలపల్లిలోని ఆర్డీటీ హోంలో ఉంచారు. పసికందును ఎక్కడికి తీసుకెళ్లారో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. స్కూలుకెళ్లి ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన ఆ బాలిక ఇప్పుడు ఎన్జీవో హోంలో ఒంటరిగా జీవిస్తోంది. ఎక్కడికెళ్లాలో తెలియదు. ఏం చేయాలో తెలియదు. ఇక్కడ ఎన్నిరోజులు ఉంచుతారో తెలియదు. ఎప్పుడు బయటకు పంపిస్తారో తెలియదు.. ఇదీ ఆ బాలిక ఎదుర్కొంటున్న అగమ్యగోచర పరిస్థితి.

అప్పుడూ అంతే.. ఇప్పుడూ అంతే..

సామూహిక అత్యాచారంతో సర్వస్వం కోల్పోయిన దళిత మైనర్‌బాలికకు సర్కారు పైసా సాయం అందించలేదు. సాయం ప్రకటిస్తే నేరం ఒప్పుకున్నట్టు అవుతుందేమో అనుకున్న ప్రభుత్వం ఇప్పటికీ స్పందించలేదు. కనీసం రాప్తాడు ఎమ్మెల్యే కూడా పరామర్శించలేదు. ఆ బాలికకు సర్కారు సాయం లేక, కుటుంబంలో కూడా చూసుకునే వారు కరువై జీవితమే ఛిద్రమైంది. ఇప్పుడా బాలికను పోషిస్తారో లేదో కూడా అంతుచిక్కడం లేదు. స్వగ్రామానికి వెళ్లినా బతకనిస్తారా అన్నది అనుమానంగా ఉందని జిల్లా వాసుల్లో చర్చ జరుగుతోంది. కర్నూలు జిల్లాలో సుగాలి ప్రీతి తరహాలోనే ఈ బాధితురాలికి టీడీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోజుకు కూడా బాలికను పరామర్శించడానికి గాని, బిడ్డను చూడటానికి గాని ఎవరికీ ప్రవేశం లేకుండా అధికారులు నిషేధం విధించారు. నెలరోజులుగా తల్లీ బిడ్డ ఎలా ఉన్నారు.. వారి బాగోగులు ఏమిటి అన్న వివరాలు ఎవరికీ తెలియడం లేదు. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు గొంతెత్తితే అడ్డుకోవడం లేదా అరెస్టులు చేస్తున్నారు. గతంలో సుగాలి ప్రీతి హత్యాచారం కేసులో చేసిన పాపాన్ని నేడు ఏడుగుర్రాలపల్లిలో అత్యాచారం ఘటన విషయంలోనూ కొనసాగిస్తున్న సీఎం చంద్రబాబు తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రిజర్వు స్థలంలో మట్టి తవ్వకాలు

ధర్మవరం: టీడీపీ కార్యకర్తలు బరితెగించారు. మున్సిపల్ రిజర్వు స్థలంలో అక్రమంగా మట్టి తవ్వి తరలించేస్తున్నారు. పట్టణంలోని 27వ వార్డు వైఎస్సార్ కాలనీలో పాఠశాల పక్కన ఉన్న మున్సిపల్ రిజర్వు స్థలంలో జేసీబీలతో ఇష్టారాజ్యంగా తవ్వడంతో పెద్దపెద్ద గుంతలు కనిపిస్తున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్టు చోద్యం చూస్తున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు చేరితే ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదని కాలనీవాసులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి అక్రమంగా మట్టిని తరలించకుండా రిజర్వు స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

రిజర్వు స్థలంలో తవ్వకాలతో ఏర్పడిన పెద్ద గుంతలు



క్లుప్తంగా

బైక్ పైనుంచి కిందపడి వ్యక్తి మృతి


వెంకటస్వామి (ఫైల్)

పరిగి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం గణపతిపల్లికి చెందిన వెంకటస్వామి (60)కి భార్య ముత్యాలమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యక్తిగత పనిపై ఆదివారం పైడేటి క్రాస్‌కు వచ్చిన వెంకటస్వామి పని ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. స్వగ్రామానికి సమీపంలోకి చేరుకోగానే వాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

9న మారథాన్ రన్

పుట్టపర్తి టౌన్: హెచ్ఐవీపై యువతకు అవగాహన కల్పించేలా ఈ నెల 9న హిందూపురంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు మారథన్ రెడ్‌రన్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునీల్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 5.30 గంటలకు హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుంది. రిలయన్స్ పెట్రోల్ బంక్, గురునాథసర్కిల్, కోట సర్కిల్, నంది సర్కిల్, రహమత్‌పూర్ సర్కిల్ వరకు ఐదు కిలోమీటర్ల మేర సాగుతుంది. జిల్లాలోని ఏదైనా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ విభాగాల వారీగా విజేతలకు నగదు పురస్కారాలను అందజేస్తారు. ఆసక్తి ఉన్న ఆదివారం ఉదయం 5.30 గంటలకు హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకోవాలి.

భార్యను నరికి చంపిన భర్త


హతురాలు లక్ష్మీదేవి

చిలమత్తూరు: స్థానిక ఎస్సీ కాలనీలో దారుణం చోటు చేసుకొంది. ఓ వివాహితని ఆమె భర్త అతి కిరాతకంగా గొడ్డలితో నరికి హత మార్చాడు. స్థానికులు తెలిపిన మేరకు... చిలమత్తూరులోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న లక్ష్మీదేవి(35), రాఘవేంద్ర దంపతులకు ఇంటర్ చదువుతున్న కుమార్తె ఉంది. టీడీపీలో చురుకుగా వ్యవహరిస్తున్న రాఘవేంద్ర ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జులాయిగా మారాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రాఘవేంద్ర కాసేపటి తర్వాత భార్యతో గొడవపడి గొడ్డలితో దాడికి తెగబడ్డాడు. రక్తం మడుగులో కొట్టుకుంటున్న లక్ష్మీదేవిని స్థానికులు వెంటనే బాగేపల్లిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, భార్యను హతమార్చిన అనంతరం రాఘవేంద్ర నేరుగా పీఎస్‌కు చేరుకుని లొంగిపోయాడు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్షణం ఆలోచిస్తే.. నిలుస్తుంది ప్రాణం



కష్టం.. నష్టం.. ఆవేదన, ఆవేశం.. ఆక్రోశం.. కారణమేదైనా ఆందోళన మనిషిని తన ప్రాణం తాను తీసుకునేలా చేస్తోంది. జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న ఆత్మహత్యలు కలవర పెడుతున్నాయి. ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో అత్యధికంగా యువతే కావడం ఆందోళనకరం.

- కలవరపెడుతున్న బలవన్మరణాలు
- ఈ ఏడాది 120మందికి పైగా మరణాలు
- 16 నుంచి 40ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారే అధికం

పుట్టపర్తి టౌన్: ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడలేక మధ్య తరగతి కుటుంబాలు..నిరుద్యోగ సమస్యతో యువత.. కుటుంబ కలహాలతో సున్నిత మనస్కులు.. వ్యవసాయంలో కష్టాలు తట్టుకోలేక అన్నదాతలు... బలవంతంగా ఉసురు తీసుకుంటున్నారు. జిల్లాలో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య ఏటికేడు పెరుగుతున్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ 120 మంది ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. ఇందులో 16 నుంచి 40 ఏళ్ల లోపు వయసున్న వారే అత్యధికంగా ఉన్నారు.

ఒక్క క్షణం ఆలోచిస్తే..

జీవితంలో ఎదురైన ఇబ్బందులు, సమస్యలను ఎదుర్కొలేక చాలా మంది ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటి వరకూ జిల్లాలో చోటుచేసుకున్న 120 ఆత్మహత్య కేసులు ఇలాంటివే కావడం గమనార్హం. అనుబంధాలు, అనురాగాలు, ఆప్యాయతలు మరిచి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన రాగానే ఒక్క క్షణం ఆలోచిస్తే ఆ ఆలోచనకు అక్కడితోనే బ్రేక్ పడుతుందని మానసిక వైద్యులు అంటున్నారు.

సకాలంలో గుర్తించాలి

ఎవరూ కూడా జీవితాన్ని విరమించుకోవాలి అని బయటికి చెప్పరు. కుంగుబాటులో ఉండేం వారి చర్యలను బట్టి అర్థం చేసుకోవాలి. ముభావంగా ఉండటం, సరిగా స్పందించకపోవడం, పదునైన వస్తువులతో ఆడుతూ ఉండటం, జీవితం దండగ లాంటి మాటలుం ఇవన్నీ ఆత్మహత్యకు సూచనలే. ఇలాంటి సమయంలో వారి మాటలను అడ్డుకోకుండా, సాంత్వనగా వినడం చాలా అవసరం. ఎదుటివారి బాధను పూర్తిగా వినాలి. అప్పుడే వారి మనసు భారం తీరుతుంది. అది ఆత్మహత్యా భావనలను చాలావరకూ తగ్గిస్తుంది. తీవ్రమైన కుంగుబాటు ఉన్నవారికి దగ్గరలో పురుగు మందులు, పదునైన వస్తువులు, మందులు లేకుండా చూసుకోవాలి. వారి మానాన వదిలేస్తే, వారే సర్దుకుంటారు కదా అనే భావన సరి కాదు. తరచూ వారిని పలకరిస్తుండాలి. వారి మానసిక స్థితిని గమనిస్తుండాలి. ఇలా చేయడం ద్వారా ఆత్మహత్య ఆలోచనను దూరం చేయవచ్చు.

జిల్లాలో మచ్చుకు కొన్ని..

- ఈ ఏడాది జూన్ 6న పెనుకొండ మండలం గోనిపెంటకు చెందిన బోయ శివకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నా.. ఏ ఒక్కటీ కుదరకపోవడంతో క్షణికావేశానికి లోనై తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు.
- జూలై 17న గుడిబండ మండలం బలాలేటిపల్లికి చెందిన మంజునాథ్ ఆత్మహత్య చేసుకున్నాడు. కడుపు నొప్పి తాళలేక క్షణికావేశంలో తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- మే 2న ధర్మవరానికి ఆంజనేయులు తన భార్యతో గొడవపడి క్షణికావేశంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఏప్రిల్ 18న రొద్దం మండలం ఆర్.కొట్టలకు చెందిన రవితేజ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు.
- ఆగస్టు 29న పరిగి మండలం కొడిగినహళ్లిలో ప్రియసాయి ఒంటరిజీవితాన్ని తాళలేక క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది.

వైకల్యం బారిన పడ్డానంటూ..


మృతుడు భార్గవ్

ధర్మవరం అర్బన్: వైకల్యం బారిన పడ్డానంటూ క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని రాజేంద్రనగర్‌లో నివాసముంటున్న గోసుల భార్గవ్(26) మొబైల్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం తండ్రి మృతి చెందాడు. వివాహం కాలేదు. తల్లితో పాటు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ఐదేళ్ల క్రితం ప్రమాదంలో కాలు విరిగింది. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి తాను వికలాంగుడినయ్యానంటూ బాధపడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భోజనం ముగించుకుని పైగదిలో నిద్రపోయాడు. ఆదివారం ఉదయం ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి కిటికిలో నుంచి చూడగా ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

టీడీపీలో తారస్థాయికి వర్గపోరు

- 27వ వార్డు ఇన్‌చార్జ్‌పై 28వ వార్డు ఇన్‌చార్జ్ అనుచరుల దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

ధర్మవరం అర్బన్: స్థానిక టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో ఆ పార్టీ 28వ వార్డు ఇన్‌చార్జ్ అనుచరులు తనపై దాడి చేశారంటూ 27వ వార్డు ఇన్‌చార్జ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు... 27వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ కంద్యాల రవీంద్రనాయుడు, 28వ వార్డు ఇన్‌చార్జ్ గస్తీ ఓంకార్ మధ్య పాత గొడవలున్నాయి. గతంలో 27వ వార్డులోని మున్సిపల్ స్కూల్ వద్ద ఓంకార్ మట్టి తోడుతున్న విషయంలో గొడవలు జరిగాయి. ఈ క్రమంలో 28వ వార్డు పరిధిలోని ఎల్–1 కేతిరెడ్డి కాలనీలో 1.5 సెంట్ల స్థలాన్ని రవికుమార్ అనే వ్యక్తి నుంచి రవీంద్రనాయుడు కొనుగోలు చేశాడు. శనివారం సాయంత్రం 28వ వార్డులో రవీంద్రనాయుడు, అతని భార్య సరళ పర్యటించి తాము కొనుగోలు చేసిన స్థలాన్ని విక్రయిస్తున్నామని, ఎవరైనా కొనుగోలు దారులు ఉంటే చెప్పాలని తమకు తెలిసిన వారితో చెప్పి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో ఓంకార్ అనుచరులు వెంకటనారాయణ, కిరణ్‌కుమార్ అడ్డుకుని 'మా అన్న ఓంకార్ వార్డులో నువ్వు ప్లాట్ల వ్యాపారం చేయడానికి వీలులేదు' అంటూ రవీంద్రనాయుడిపై దాడికి పాల్పడ్డారు. షర్ట్ చించి, కాళ్లతో తన్నారు. అడ్డుకోబోయిన సరళను మహిళ అని కూడా చూడకుండా దుర్భాషలాడారు. చుట్టుపక్కల వారు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. గాయపడిన రవీంద్రనాయుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి


అన్నదాత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, నాయకులు

నల్లమాడ: రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అసమర్థ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధరరెడ్డి ఆరోపించారు. ఈ నెల 9న పుట్టపర్తిలో తలపెట్టిన అన్నదాత పోరు పోస్టర్లను నల్లసింగయ్యగారిపల్లిలోని తన స్వగృహంలో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందన్నారు. ప్రభుత్వం చేతగాని తనం కారణంగా బ్లాక్ మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.600 లకు విక్రయిస్తున్నారని మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా నెరవేర్చకుండానే సక్సెస్ మీటింగ్‌లు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 66 లక్షలు ఉన్న సామాజిక పింఛన్లలో ఇప్పటికే ఆరు లక్షలు తొలగించారని, వీటిని 50 లక్షలకు కుదించే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... రైతుల శ్రేయస్సు, ఆర్థిక భద్రతకు నిరంతరం కృషి చేశారన్నారు. వేరుశనగ, వరి, చిరుధాన్యాలు అన్నింటికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు నిర్మించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు, వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందించడమే గాక ఏ సమయంలో ఏ పంట వేయాలో, ఏయే మందులు వాడాలో వ్యవసాయ సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ వచ్చారన్నారు. రైతు సమస్యలపై ఈ నెల 9న మంగళవారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు టీడీ కేశవ రెడ్డి, శేషురెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీలా రెడ్డి, సంయుక్త కార్యదర్శి దేశాయి భారతీరెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి సతీష్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి అంజినప్ప, నియోజకవర్గ అధ్యక్షుడు ఆసాది గంగిశెట్టి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కన్యాకుమారి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, ఎంపీపీ పెడబల్లి రమణారెడ్డి, కన్వీనర్లు జయప్ప, రవీనాయక్, మాజీ కన్వీనర్ పొరకల రామాంజనేయులు, ఎస్టీ సెల్ విజయకుమార్ నాయక్, సర్పంచ్‌లు జగన్‌మోహన్ చౌదరి, మల్లికార్జున , నాగరాజునాయుడు, నరసింహమూర్తి, నాయకులు గోవర్దన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దాదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మడకశిర మండలం జమ్మానిపల్లి వద్ద కనువిందు చేస్తున్న ఇంద్రధనుస్సు

ఆకాశంలో అందాల హరివిల్లు

మడకశిర రూరల్/కదిరి అర్బన్: ఆకాశంలో ఆదివారం సాయంత్రం అందాల హరివిల్లు కనువిందు చేసింది. సాయంత్రం చిరు జల్లులు కురుస్తుండగా కదిరిలోని టిడ్కో సముదాయాల వద్ద, మడకశిర మండలం జమ్మానిపల్లి వద్ద ఏర్పడిన ఇంద్ర ధనుస్సులను చూసి పలువురు ఆసక్తిగా గమనించారు. కాంతి పరావర్తనం కారణంగా ఒకదానిపై ఒకటి ఏర్పడిన ఇంద్రధనుస్సులను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించేందుకు పోటీ పడ్డారు.

బసంపల్లిలో మృతదేహం ఖననానికి అడ్డంకులు


నారాయణ మృతదేహం వద్ద కూర్చొన్న కుటుంబ సభ్యులు, కాలనీవాసులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లిలో మాల సామాజిక వర్గానికి చెందిన నారాయణ (85) ఆదివారం వేకువజామున మృతి చెందాడు. స్థల సమస్య కారణంగా ఖననానికి ఇబ్బందులు ఎదురుకావడంతో మృతదేహాన్ని ఇంటి వద్దే ఉంచుకోవడం కలకలం రేపింది. గ్రామంలో దళితుల శ్మశాన స్థల వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ, ఆనంద్, ప్రకాష్‌తో పాటు దళిత వర్గీయుల మధ్య స్థల వివాదం ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది. దీంతో దళితుల కుటుంబాల్లో ఎవరు మరణించినా వారి మృతదేహాన్ని ఖననం చేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం నారాయణ కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందిని తెలుసుకున్న తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. ప్రస్తుతం శ్మశాన స్థల వివాదం కోర్టులో ఉందని, పరిష్కారం అయ్యే వరకూ మృతదేహాలను మరో చోట ఖననం చేయాలని సూచించారు. అయితే.. ఆనవాయితీ మేరకు అదే స్థలంలోనే ఖననం చేసేలా అనుమతులు ఇవ్వాలని అధికారులను దళితులు కోరారు.

'హంద్రీ-నీవా'లో తెలంగాణ వాసి గల్లంతు

వజ్రకరూరు: మండల పరిధిలోని హంద్రీ-నీవా కాలువలో తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తెలంగాణలోని నల్గొండ జిల్లా కందుకూరు మండలం శాంతిగూడెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని బెంగళూరు నుంచి తన స్నేహితులతో కలసి వజ్రకరూరు మండలం పీసీ.ప్యాపిలికి ఆదివారం వచ్చాడు. ఈ క్రమంలో పీసీ ప్యాపిలి వద్ద ఉన్న హంద్రీనీవా ప్రధాన కాలువ వద్దకు స్నానం చేసేందుకు వెళ్లిన నాగిరెడ్డి... ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి గల్లంతయ్యాడు. కళ్ల ఎదుటే నీటిలో కొట్టుకు పోతున్న నాగిరెడ్డిని కాపాడేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నాగిరెడ్డి స్నేహితుడు రాజశేఖర్ సమాచారంతో పోలీసులు రంగంలో దిగి గాలింపు చర్యలు చేపట్టారు.

సత్సంబంధాలతోనే ఉన్నత శిఖరాలు

- సినీ నటుడు నాగినీడు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో నిర్వాహకులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న నాగినీడు

ధర్మవరం అర్బన్: విద్యార్థులతో ఉపాధ్యాయులు సత్సంబంధాలను కలిగి ఉండాలని, అప్పుడు ఆ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సినీ నటుడు వెల్లంకి నాగినీడు అన్నారు. ఆత్మీయ ట్రస్ట్, యూటీఎఫ్ ధర్మవరం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ధర్మవరంలోని ఎన్జీఓ హోంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగినీడు హాజరై, మాట్లాడారు. విద్యార్థుల ఆలోచనలను పసిగట్టి వాటికి అనుగుణంగా పాఠాలు బోధించాలన్నారు. శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 68 మందిని ఎంపిక చేసి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌కుమార్, పెనుకొండ డీవైఈఓ జాన్ రెడ్డప్ప, ధర్మవరం ఎంఈఓలు రాజేశ్వరిదేవి, గోపాల్‌నాయక్, హనుమంతరెడ్డి, యూటీఎఫ్ నాయకులు సుధాకర్, రమణయ్య, రామప్పచౌదరి, నారాయణస్వామి, రామకృష్ణనాయక్, బూతన్న, బాబు, శ్రీనివాసులు, మేరీవరకుమారి, మారుతి, ఆంజనేయులు, అమర్‌నారాయణరెడ్డి, హరికృష్ణ, రాంప్రసాద్, వెంకటకిషోర్, సకల చంద్రశేఖర్, సురేష్, హెచ్.రామాంజనేయులు, సాయిగణేష్, జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

అది హిట్ కాదు.. సూపర్ చీట్ సభ

- చంద్రబాబు 14 నెలల్లో జిల్లాకు వెలగబెట్టింది శూన్యం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫైర్


అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పార్టీ నేతలు

రాప్తాడురూరల్: 'చంద్రబాబు ఎన్నికల ముందు 200కు పైగా హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్‌లో రెండు పథకాలు అరకొరగా అమలు చేయగానే 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' అంటున్నారు. అది సూపర్ హిట్ కాదు సూపర్ చీట్ సభ' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో తలపెట్టిన 'అన్నదాత పోరు'కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలకు రూ. 10 లక్షల కోట్లు అవసరం అవుతాయని, ఇప్పటిదాకా కనీసం రూ. 50 వేల కోట్ల పథకాలు కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. లేదంటే ప్రతినెలా రూ. 2 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. జిల్లాలో ఉపాధి లేక వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాలేవీ ఆపను... వాటితో పాటు అదనంగా ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు 'చేయూత, ఆసరా, నేతన్న నేస్తం' అందించలేదన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి దుష్ప్రచారం చేసి అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని చెప్పి ఈరోజు ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు యూరియా కొరత కనిపించలేదా? బ్లాక్‌మార్కెట్‌కు తరలించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

14 నెలల్లో ఏం వెలగబెట్టారు?

ఈ 14 నెలల్లో జిల్లాకు చంద్రబాబు ఏం వెలగబెట్టారని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు జగన్‌ను తిడుతూ లోకేష్ వద్ద మెప్పు పొందాలని చూస్తున్నారన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తామని ఒక్క ఇల్లయినా ఇచ్చారా అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చి అందులో 7 నిర్మాణాలు కూడా పూర్తి చేశారన్నారు. చంద్రబాబు వచ్చిన తర్వాత వాటిని సంపూర్ణంగా ప్రైవేట్‌పరం చేశారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి ఆర్నెల్లలో ప్రజలకు రూ. 16 వేల కోట్ల వాతలు పెట్టారన్నారు. గ్రేటర్ రాయలసీమ పరిధిలో రూ. 40 వేల కోట్లు ఖర్చు చేస్తే సంపూర్ణంగా నీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని, అలాంటి వాటిని పక్కన పెట్టేసి అమరావతికి మాత్రమే పరిమితమయ్యారని మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్ట్ గురించి పట్టించుకోదన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు అనుమతులు తీసుకొచ్చేందుకు ఎందుకు చిత్తశుద్ధి చూపించడం లేదని విమర్శించారు. హంద్రీ-నీవా వెడల్పులో భాగంగా గత ప్రభుత్వం 6,300 క్యూసెక్కులకు అనుమతులిచ్చి పనులు ప్రారంభిస్తే దానిని 3,800 క్యూసెక్కులకు కుదించడం వంచన కాదా అన్నారు. లైనింగ్ పనులను కేవలం చిత్తూరు జిల్లాకు నీటిని తీసుకెళ్లేందుకు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడం జిల్లా రైతులకు మోసం చేయడం కాదా అని నిలదీశారు. అన్ని వర్గాల ప్రజలనూ మోసగించిన చంద్రబాబుకు అనంతకు రావడానికి అర్హత ఉందా అని ప్రశ్నించారు. పయ్యావుల కేశవ్ ఫెయిల్యూర్ మినిస్టర్ అని , మరో మంత్రి సవితమ్మకు పులివెందుల వెళ్లి దొంగ ఓట్లు వేయించే శ్రద్ధ జిల్లా ప్రజల పట్ల లేదని విమర్శించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఢిల్లీలో ఉంటారో, లక్నోలో ఉంటారో, బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఉంటారో ఎవరికీ తెలీదన్నారు.

ఆ ఎమ్మెల్యేలు అన్నమే తింటున్నారా?

అనంతపురం, రాప్తాడు ఎమ్మెల్యేలు కనీసం కడుపునకు అన్నం తింటున్నారా అని మండిపడ్డారు. వారి నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఇళ్ల నిర్మాణాలను 14 నెలలుగా విజిలెన్స్ తనిఖీల పేరుతో నిలబెట్టారని, ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని అడ్వకేట్ జనరల్ స్పష్టం చేశారంటే ఆ ఇద్దరికీ సిగ్గుందా అని దుయ్యబట్టారు. అసమర్థ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధనాపేక్ష కోసం పేదల ఇళ్ల నిర్మాణం అటకెక్కించారని ధ్వజమెత్తారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగంపేట గోపాల్‌రెడ్డి, బండి పవన్, లింగారెడ్డి, లోకనాథరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.